

మెట్‌పల్లి పట్టణ పరిధిలో లబ్ధిదారులకు కేటాయించిన రెండు పడక గదుల ఇళ్లు ఇవి. అన్ని వార్డుల నుంచి రెండు విడతల్లో 3,117 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అధికారులు 1,071 మందిని అర్హులుగా తేల్చారు. డ్రా పద్ధతిలో 110 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి అర్బన్ కాలనీలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో వారికి కేటాయించారు. మిగతా వారికి అర్హత ఉన్నా సొంతింటి కల కలగానే మిగిలింది.



రాయికల్ పట్టణంలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. 2015లో దరఖాస్తులు స్వీకరించగా 1,211 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 126 మందిని అర్హులుగా గుర్తించి డ్రా పద్ధతిలో 60 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 2017లో జీ ప్లస్ టూ పద్ధతిలో 60 ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మొదట 24 మంది లబ్ధిదారులకు సరిపడా పనులు ప్రారంభించినా పిల్లర్ దశలోనే నిలిచిపోయాయి. డ్రాలో ఎంపికైన మరో 36 మంది లబ్ధిదారులతో పాటు మిగతా అర్హులు ఇళ్ల కోసం నిరీక్షిస్తున్నారు.

అర్హత ఉన్నా అందకపాయే..!

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణంలో జాప్యం

న్యూస్‌టుడే, మెట్‌పల్లి, రాయికల్‌పట్టణం

గూడు లేని పేదలకు సొంతింటి కలను సాకారం చేయడానికి ఉద్దేశించిన గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకం ప్రారంభించింది. లబ్ధిదారుల ఎంపిక పూర్తయి ఏళ్లు గడుస్తున్నా వారి సంఖ్యకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాల్లో ముందడుగు పడకపోవడంతో అర్హులకు నిరాశే ఎదురవుతోంది. ఇళ్లు పొందేందుకు అన్ని అర్హతలున్నా నిరీక్షణ తప్పడం లేదని పేదలు వాపోతున్నారు. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పురపాలికలతో పాటు మండలాల నుంచి రెండు పడక గదుల ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించి చాలా చోట్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. తొలి విడతలో ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.6.29 లక్షలు ఖర్చు చేయగా, రెండో విడతలో మాత్రం రూ.5.04 లక్షలు కేటాయించారు. జిల్లాకు మొత్తం 8,225 ఇళ్లు మంజూరవగా, 5,731 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 2,434 ఇళ్ల పనులు మొదలు కాలేదని తెలుస్తోంది. కాగా కొన్ని చోట్ల నిర్మాణాలు ప్రారంభించిన మధ్యలోనే నిలిపివేశారు. నిర్మాణ వ్యయం పెరగడం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో చాలా చోట్ల గుత్తేదారులు పనులను మధ్యలోనే వదిలేశారు. 305 ఇళ్లు ప్రగతిలో ఉండగా, అవి ఎప్పటికి పూర్తవుతాయోనన్నది ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాకు మంజూరైన ఇళ్లు: **8,225**
నిర్మాణం పూర్తయినవి: **5,731**
ప్రగతిలో ఉన్నవి: **305**
లబ్ధిదారులకు కేటాయించినవి: **4,653**

తొలగని సందిగ్ధం

రెండు పడక గదుల ఇళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించే విధానాలపై ఇంకా సందిగ్ధం తొలగక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించి లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లించనున్నారు. కాగా ఇప్పటికే అర్హులుగా ఎంపికైన వారితో పాటు రెండు పడక గదుల ఇళ్లు కూడా కొన్ని నిర్మాణంలో ఉండగా, మరికొన్ని పనులు ప్రారంభించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

లబ్ధిదారుల ఎంపికలో తాత్సారం

జిల్లాలో కొన్నిచోట్ల లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించలేదు. అర్హులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించడంలో తాత్సారం జరుగుతోంది. కొన్నిచోట్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా సరిపడా ఇళ్లు నిర్మించక, పూర్తికాక ఎదురుచూపులు చూడాల్సి వస్తే, మరికొన్ని చోట్ల ఇళ్లు పూర్తయినా అర్హుల ఎంపికలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 5,731 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా 4,653 మందికి కేటాయించారు. ఇంకా మిగతా 1,078 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మౌలిక వసతులేవీ?

తొలి విడతలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో మౌలిక వసతులు కల్పించగా, రెండో విడతలో నిర్మించిన చోట మాత్రం కనీస వసతులు కరవయ్యాయి. తొలి విడత కంటే రెండో విడత వచ్చే సరికి నిర్మాణ వ్యయం తగ్గించడంతో రహదారులు, మురుగు కాల్వలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించే పరిస్థితి లేకుండాపోతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఇబ్బందులు తప్పవని లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలి

జగిత్యాల: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పురపాలక, మండల పరిషత్తు తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అధికారి రోజుకు 40 దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి పాల్గొన్నారు.



మోసం కొండంత.. వసూలు గోరంత!

సవాలుగా జీఎస్టీ అక్రమాల కేసు

ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, జగిత్యాల

జగిత్యాల కేంద్రంగా జరిగిన జీఎస్టీ మోసం కథ ఎటూ తేలడం లేదు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోని ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) రూపంలో జరిగిన అక్రమ బాగోతం తాలూకు విచారణ ఇంకా నడుస్తూనే ఉంది. సుమారు 9 నెలల కిందట జగిత్యాలకు చెందిన జీఎస్టీ ప్రాక్టీషనర్ తప్పుడు ధ్రువపత్రాలతో బోగస్ సంస్థలను ఏర్పాటు చేసి దాదాపుగా రూ.288 కోట్ల ఆర్థిక మోసానికి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. కాగితాలపైనే సృష్టించిన పలు బోగస్ కంపెనీలకు ఆ సొమ్మును బదలాయించారు. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని ఆలస్యంగా గుర్తించిన వాణిజ్య పన్నుల అధికారులు మొదట విస్తుపోయారు. తీరిగ్గా తేరుకుని బాధ్యుడిగా గుర్తించిన వ్యక్తి కార్యాలయంలో సోదాలు చేపట్టారు. పలు పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేసి అరెస్ట్ చేయించారు. తరువాత ఈ విచారణను హైదరాబాద్ నుంచి వచ్చిన వాణిజ్య పన్నుల శాఖ విజిలెన్స్ అధికారులు చేపట్టారు. తమ సంస్థలను మూసివేయమని జీఎస్టీ ప్రాక్టీషనర్ వద్దకు వచ్చిన కొందరు వ్యాపారుల ఆధార్ కార్డులను ఉపయోగించి ఆన్‌లైన్‌లో ఈ కుంభకోణానికి తెరతీసినట్లు విచారణలో గుర్తించారు. ఇలా 32 బోగస్ కంపెనీలను ఏర్పాటు చేసి సిమెంట్, ఐరన్ వ్యాపారాలు చేస్తున్నట్లు కాగితాల్లోనే నమ్మించాడు. ఆ బోగస్ సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో జమ అయిన మొత్తం డబ్బులను 302 మంది వ్యాపారులకు బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన సంస్థలకు ఈ నగదు వెళ్లినట్లు గమనించారు. ఇందులో పెద్దమొత్తంలో ఒక సంస్థకు రూ.120 కోట్లు బదలాయింపు జరిగిన తీరు తెలుసుకుని అధికారులు నివ్వెరపోయారు.

వసూలు కష్టమే..: కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఈ అక్రమంలో భాగమైన బాధ్యుడిని గుర్తించి పట్టుకున్నప్పటికీ.. పక్కదారి పట్టిన సొమ్మును తిరిగి వసూలు చేయడం అధికారులకు తలకు మించిన భారంగానే మారింది. ఇప్పటి వరకు గుర్తించిన పలువురు వ్యాపారులు, సంస్థల నుంచి రూ.13 కోట్లకుపైగా డబ్బును రాబట్టినట్లు తెలిసింది. మొత్తం మోసంలో ఇప్పటివరకు రికవరీ అయింది కేవలం 5 శాతమే. మూడు నెలల కిందటి వరకు రూ.11 కోట్లు రాగా.. ఇటీవల ఈ మొత్తం రూ.13 కోట్లను దాటినట్లు సమాచారం. జగిత్యాల కేంద్రంగా జరిగిన ఈ భారీ మోసాన్ని అప్పట్లో సవాలుగా తీసుకున్న అధికారులు కాలక్రమేణా ఇతర పనుల్లో తీరిక లేకుండా పోవడంతో విచారణలో దూకుడు ప్రదర్శించడం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా పోలీసులు, వాణిజ్య పన్నుల అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే ఇంకా ఇందులో భాగమైన వారెవరనేది బాహ్య ప్రపంచానికి తెలిసే అవకాశముంది. పైగా రాష్ట్రంలోనే బోగస్ సంస్థలు ఏర్పాటు చేసి సొమ్మును బదలాయించినట్లు గుర్తించిన అధికారులు అందులో కొందరికి సర్‌చార్జ్ నోటీసులు అందించినట్లు తెలుస్తోంది. తరువాత రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టాన్ని ఉపయోగించి పోయిన నగదును తిరిగి చేజిక్కించుకునే విషయమై కసరత్తు చేసింది. పూర్తిస్థాయిలో మోసపోయిన సొమ్మును వసూలు చేయడం కష్టసాధ్యంగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయమై వాణిజ్య పన్నుల శాఖ కరీంనగర్ డివిజన్ జాయింట్ కమిషనర్ రవికుమార్‌ను సంప్రదించగా రికవరీ ఎంత చేశారనేది ఈ కేసుని పర్యవేక్షిస్తున్న హైదరాబాద్‌లోని అధికారులకే తెలుస్తుందన్నారు.

రామాయణాన్ని వరంగా ఇచ్చిన వాల్మీకి

జగిత్యాల : మహర్షి వాల్మీకి రామాయణాన్ని ప్రపంచానికి వరంగా ఇచ్చారని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతమైన ఆదర్శాలను రామాయణం మనకు అడుగడుగునా బోధిస్తుందన్నారు. అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, బి.గౌతంరెడ్డి, ఏవో పి.హన్మంతరావు, ఆర్డీవో పి.మధుసూదన్, బీసీ సంక్షేమాధికారి ఎల్.సాయిబాబా పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

విధుల్లో చేరిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల ఫాస్ట్‌ట్రాక్ కోర్టు(పోక్సో) ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన చీటి రామక్రిష్ణారావు గురువారం విధుల్లో చేరారు. ఈ మేరకు కరీంనగర్ ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ శరత్ వద్ద రిపోర్ట్ చేశారు. నెలకు రూ.40 వేల గౌరవ వేతనంపై మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు.

రాకపోకలకు ఇబ్బంది

సమాచారం లేకుండా జాతీయ రహదారికి మరమ్మతు

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం అనంతారం జాతీయ రహదారి వాగుపై ఉన్న వంతెన భారీ వర్షాలకు కోతకు గురికావటంతో గురువారం మధ్యాహ్నం మరమ్మతు పనులను గుత్తేదారు ప్రారంభించారు. కోతకు గురైన ప్రాంతంలో సీసీ వేస్తే బలంగా ఉంటుందని అధికారుల సూచన చేసిన నేపథ్యంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించిన గుత్తేదారు అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రోడ్డు మూసి వేయటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారిపై ఇంత నిర్లక్ష్యమా అంటూ ప్రయాణికులు మండిపడ్డారు. జాతీయ రహదారి మూసివేతకు అనుమతి తీసుకున్నప్పటికీ రెండు రోజుల ముందే సమాచారం ఇవ్వాలి కానీ అదేమీ లేకుండానే పనులు చేయటం విమర్శలకు దారి తీసింది.



అనంతారం వంతెన వద్ద ప్రారంభమైన పనులు

10 రోజులు వాహనాల మళ్లింపు...

జగిత్యాల నుంచి మంచిర్యాల, ధర్మపురి వైపు వెళ్లే వారు జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట నుంచి సారంగాపూర్ రోడ్డు లక్ష్మీదేవిపల్లి, అర్పల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. మంచిర్యాల, ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వచ్చేవారు అర్పపల్లి, లక్ష్మీదేవిపల్లి మీదుగా జగిత్యాలకు చేరుకోవచ్చు. సారంగాపూర్, బట్టపల్లి-పోతారం నేరెళ్ల మీదుగా రాకపోకలు సాగించవచ్చు. ఈ పనులు దాదాపు 10 రోజులు పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు రాకపోకలు నిలిపివేయనున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ జనసురక్షా బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షాబీమా యోజన కోసం అర్హులైన వారు ఫిబ్రవరి 15లోగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా పండుగ

14 రోజుల్లో రూ.31 కోట్ల ఆదాయం

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

దసరా పండుగ ఆర్టీసీకి గణనీయ ఆదాయం తెచ్చింది.. రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బస్సులు నడపడం.. లక్షలాది మంది బస్సుల్లో ప్రయాణించడంతో సంస్థకు రూ.కోట్ల ఆదాయం సమకూరింది. పాఠశాలలకు ఈ నెల 2వ సెలవులు ప్రకటించగా 1వ తేదీ సాయంత్రం నుంచే ప్రారంభమైన రద్దీ 16వ తేదీ వరకు కొనసాగింది. . సంస్థ రూ.31.49 కోట్ల ఆదాయం ఆర్జించింది.

ప్రత్యేక ఏర్పాట్లతో..

పండుగల సందర్భంగా రద్దీ అధికంగా ఉంటుందని భావించిన ఆర్టీసీ అధికారులు పకడ్బందీ ప్రణాళికతో సాగారు. జేబీఎస్‌తోపాటు ఆదిలాబాద్, మంచిర్యాల, హనుమకొండ ప్రాంతాలకు అదనపు సర్వీసులు నడిపారు. సరిపడా బస్సులు లేకపోవడంతో హైదరాబాద్ నుంచి సిటీ బస్సులను తెప్పించి రద్దీకి అనుగుణంగా పంపించారు. ఈ నెల 3 నుంచి 11 వరకు డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు, సూపర్‌వైజర్లు జేబీఎస్‌లో మకాం వేసి రద్దీని పరిశీలిస్తూ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు ఎస్.భూపతిరెడ్డి, సత్యనారాయణ కరీంనగర్ బస్టాండ్‌లోనే ఉంటూ రద్దీని స్వయంగా పరిశీలిస్తూ ఆయా రూట్లలో బస్సులు తిరిగేలా చూశారు.

డిపోల వారీగా..

● ఆదాయపరంగా గోదావరిఖని డిపో రూ.5.27 కోట్లతో మొదటి స్థానంలో నిలవగా, హుస్నాబాద్ డిపో రూ.1.43 కోట్లతో చివరి స్థానంలో నిలిచింది. ప్రయాణికులపరంగా గోదావరిఖని డిపో 9.79 లక్షల మంది ప్రయాణికులను (మహిళలు 6.87లక్షలు) చేరవేసి ప్రథమ స్థానంలో నిలవగా, వేములవాడ డిపో 5.16 లక్షల మందిని (మహిళలు 3.95 లక్షలు) చేరవేసి చివరి స్థానంలో నిలిచింది.



సమష్టి కృషితోనే సాధ్యమైంది

లక్షలాది ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేర్చడంలో సిబ్బంది పాత్ర ప్రశంసనీయం. డ్రైవర్లు, కండక్టర్లు, కంట్రోలర్లు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు ఇతర సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాం. **- సుచరిత, రీజినల్ మేనేజర్, కరీంనగర్ రీజియన్**

● తిరిగిన ట్రిప్పులు : **12,726**
● దూరం : **53.32** లక్షల కిలోమీటర్లు
● మొత్తం ప్రయాణికులు : **61,11,849**
● మహిళలు : **42,34,544** (69 శాతం)

డిపో	ఆదాయం(రూ.కోట్లలో)
గోదావరిఖని	5.27
కరీంనగర్-2	4.23
జగిత్యాల	4.21
కరీంనగర్-1	3.38
వేములవాడ	2.32
సిరిసిల్ల	2.27
కోరుట్ల	2.25
మెట్‌పల్లి	2.14
హుజూరాబాద్	2.11
మంథని	1.83
హుస్నాబాద్	1.43

జగిత్యాల పుర కమిషనర్ సరెండర్

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల పురపాలక కమిషనర్ కె.సమ్మయ్యను పురపాలక పరిపాలన సంచాలకుడికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో పారిశుద్ధ్యం నిర్వహణ, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల పరిష్కరణలో విఫలం కావడం, విజయదశమి సందర్భంగా జమ్మిగద్దె వద్ద ఏర్పాట్లు చేయకపోవడం తదితర అభియోగాలపై ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాయికల్ ఎంపీడీవో చిరంజీవిని ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలేవీ?

■ జగిత్యాల - ధర్మపురి మధ్య పొలాస వద్ద జాతీయ రహదారిపై గత వారం జరిగిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

■ ధర్మపురి మండలంలోని ఆకుసాయిపల్లె వద్ద జరిగిన ఓ ప్రమాదంలోనూ ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

■ నేరెళ్ల వద్ద ఒకరు మృతి చెందగా.. ఇద్దరు గాయపడ్డారు.



నేరెళ్ల వద్ద ప్రమాదకరంగా మూలమలుపు

న్యూస్‌టుడే, ధర్మపురి

పైవన్నీ ఈ ఏడాది జరిగిన ఘటనలే. ధర్మపురి-జగిత్యాల రహదారిపై పలుచోట్ల ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పలువురు మృత్యువాత పడటం, కొందరు ఆసుపత్రుల పాలవుతున్నారు. ధర్మపురి-జగిత్యాల జాతీయ రహదారి 29 కి.మీల ఉండగా.. ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి 63 అయినా రెండు వరుసలకే పరిమితమైంది.

పదిచోట్ల ప్రమాదరకరంగా..

ఈ రహదారిపై సుమారుగా పది చోట్ల ప్రమాదకరంగా మూల మలుపులు, రోడ్డు అధ్వాన్నంగా ఉంది. ప్రధానంగా ఆకుసాయిపల్లె గుట్ట ప్రాంతంలో మూలమలుపు ఆందోళనకరంగా ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 30 ప్రమాదాలు జరగగా.. అయిదుగురు మృత్యువాత పడ్డారు. పదిమంది వరకు గాయాలపాలయ్యారు. నేరెళ్ల గుట్ట సమీప రహదారిపై లోలెవల్ వంతెన వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ హైలెవల్ వంతెనను నిర్మించడంతోపాటు రోడ్డును వెడల్పు చేయాల్సి ఉంది. రెండు వైపులా రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. ఈ విషయమై ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకువెళ్లగా.. ధర్మపురి - జగిత్యాల రహదారిపై ప్రమాదాల నివారణకు త్వరలోనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు విస్తరణపై ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

సమస్య: పలు వార్డుల్లో కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. కుక్కలపై వెంటనే చర్యలు తీసుకోండి.
- రాజేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజకుమార్

సమాధానం: త్వరలో నివారణ చర్యలు తీసుకుంటాం.
- మోహన్, పుర కమిషనర్, మెట్‌పల్లి

సమస్య: దోమల తీవ్రతతో జ్వరాల బారిన పడుతున్నాం. దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. - సంతోష్, రామకృష్ణ

సమాధానం: ప్రతి రోజు రెండు వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. - మోహన్, పుర కమిషనర్, మెట్‌పల్లి

న్యూస్‌టుడే, ధర్మపురి

సమస్య: పట్టణంలో పలుచోట్ల మిషన్ భగీరథ ద్వారా ఇంటికి చేరే పైపులు లీకేజీలతో ఉన్నాయి. వీటిని సవరించాలి.
- రాజేష్, తమ్మళ్లకుంట వీధి, ధర్మపురి

సమాధానం: ఇప్పటికే పలు లీకేజీలను తొలగించాం. క్షేత్రస్థాయిలో మరింత పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం.
- వివేకానంద, ఏఈ, మిషన్ భగీరథ, ధర్మపురి

కొత్త ఉపాధ్యాయులకు ఘన స్వాగతం


వెంపల్లిలో స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, గ్రామస్థులు

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మండలం వెంపల్లి ప్రాథమిక పాఠశాలకు నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు గురువారం గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు ర్యాలీగా వెళ్లి ఉపాధ్యాయులు ప్రవళిక, జ్ఞానేశ్వర్, హారికను సన్మానించడంతో పాటు కోలాటాలు, నృత్యాలు చేస్తూ పాఠశాలకు తీసుకువచ్చారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బియ్యం బకాయిలు చెల్లించాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: బియ్యం బకాయిలు వెంటనే చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాల అధికారులు, ధాన్యం మిల్లుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2034-24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన కస్టం మిల్లింగ్ బియ్యాన్ని ఈనెల 31లోగా భారత ఆహార సంస్థకు ఇవ్వాలని లేనట్లయితే చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఇదే సందర్భంగా ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దిగుమతికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి. ఎస్.జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీసా పేరుతో మోసం.. వ్యక్తి అరెస్టు

బోయినపల్లి, న్యూస్‌టుడే: వీసా పేరుతో మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు గురువారం వేములవాడ గ్రామీణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన వెంకటేశ్ ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. సారంగాపూర్ మండలానికి చెందిన కల్యాణ్ రమేశ్ అలియాస్ దండుగుల కల్యాణ్ వర్మ వీసాపై గల్ఫ్‌కు పంపిస్తానని వెంకటేశ్ వద్ద రూ.75 వేలు తీసుకుని టూరిస్ట్ వీసాపై పంపించాడు. గల్ఫ్ వెళ్లిన వెంకటేశ్ విషయం తెలుసుకుని మోసపోయినట్లు గుర్తించి స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కల్యాణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కల్యాణ్ మరికొంత మంది వద్ద డబ్బులు తీసుకొని మోసం చేసినట్లు తెలిసిందన్నారు. కల్యాణ్ బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

రైతు నాయకులపై కేసులు ఎత్తివేయాలి

జగిత్యాల వాణిజ్యం: భారాస ప్రభుత్వ హయాంలో 2019లో సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు చేపట్టిన రైతు ఐక్యవేదిక నాయకులపై పెట్టిన కేసులను ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఎత్తివేయాలని రైతునాయకులు కోరారు. కేసులతో ఇప్పటికే కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, బందెల మల్లయ్య, ఐల్నేని సాగర్‌రావు, గంగారెడ్డి, ఎం.రాంరెడ్డి, భూమారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

దీపోత్సవం

శ్రీకనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం అష్టలక్ష్మీ దేవాలయ ఆవరణలో పౌర్ణమి సందర్భంగా దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, మాతలు దీపాలను వెలిగించి మోతె చెరువులో వదిలారు.
- న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్



అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి


చిట్టాపూర్‌లో కరపత్రం ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోరుట్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఉపాధ్యాయులందరూ విధిగా ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూటీఎస్ కోరుట్ల అధ్యక్షుడు అబ్దుల్ వాజిద్ పేర్కొన్నారు. గురువారం కోరుట్ల పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ఫారం-19 పత్రాలను ఉపాధ్యాయులకు అందజేశారు. వెంకట సుధీర్, సర్తాజ్ అహ్మద్, సురేఖ, శ్రీనివాస్, సైఫోద్దీన్, యూసుఫ్‌అలీ, శ్యాంసుందర్, క్రిష్ణమోహన్‌రావు, గంగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో అధ్యాపకులు విధిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. దామోదర్‌రెడ్డి, దేశ్‌రాజ్ రాజేష్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుపై గురువారం మేడిపల్లి మండలంలోని ఉన్నత పాఠశాలల్లో పీఆర్టీయూ నాయకులు అవగాహన కల్పించారు. పీఆర్టీయూ తరపున వంగ మహేందర్ రెడ్డి బరిలో నిలుస్తారని, మద్దతు పలకాలని అభ్యర్థించారు. బొంగోని మల్లేశం గౌడ్, రాజేందర్, చంద్ర ప్రకాశ్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఎండీ ఆసిఫ్ ఖాన్, వినోద్, గంగాధర్, కిషోర్, రామక్రిష్ణ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


మేడిపల్లి: ఓటరు అవగాహన కార్యక్రమంలో...


వెల్గటూరు: పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో...

వెల్గటూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతూ.. పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో వెల్గటూరు, ఎండపల్లి మండలాల్లోని పాఠశాలల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఫారం-19, అనుబంధం-2ను అందచేసి ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టారు. మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, బాధ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రీడా పోటీలకు చల్‌గల్ విద్యార్థులు

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 24 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు మండలంలోని చల్‌గల్ విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ వెంకటలక్ష్మీ తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీలకు ఎంపికైన వారిలో ముస్తఫా, గమ్య, గీతిక, సంజన, హరిణీ, శివకుమార్ అనే విద్యార్థులున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14 విభాగంలో నిచిత, గమ్య, అప్సర, కౌశిక్‌తోపాటు అండర్ 17 విభాగంలో హరిణీ, అక్షయ, శివకుమార్ ఎంపిక కాగా ప్రధానోపాధ్యాయురాలు లలితాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.


కోరుట్ల: కేపీఎస్ విద్యార్థులు

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ

కోరుట్ల, న్యూస్‌టుడే: హరియాణాలో జరిగిన 9వ జాతీయస్థాయి బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కోరుట్ల పట్టణానికి చెందిన కేపీఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. తెలంగాణ తరపున ప్రాతినిథ్యం వహించి 3వ స్థానంలో నిలిచి క్యాంస పతకాలను కైవసం చేసుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.


క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వాల్మీకి జయంతి

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతి వేడుకలను పుర కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళి అర్పించారు. పుర అధ్యక్షుడు హన్మాండ్లు, బల్దియా మేనేజర్ వెంకటి, శ్రీరాముల సత్యనారాయణ, బల్దియా సిబ్బంది రాకేశ్, శ్రీనివాస్, గంగారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


భీమ్‌రాజ్‌పల్లిలో...

జగిత్యాల ధరూర్‌క్యాంపు: మహర్షి వాల్మీకీ జయంతిని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జగిత్యాలలో నిర్వహించారు. హరి అశోక్‌కుమార్, గౌరిశెట్టి విశ్వనాథం, ప్రకాశ్‌రావు, విజయ్, యాకూబ్, హన్మంతరెడ్డి, నారాయణ, దేవేందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: భీమ్‌రాజ్‌పల్లిలోని వాల్మీకీ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. రామాయణాన్ని రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి అని ఆ సంఘం నాయకులు కొనియాడారు. వెంకటేశం, సత్యనారాయణ, కుమార్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.


పుర కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు

అనారోగ్య కారణాలతో ఆత్మహత్య

పెగడపల్లి: మండలంలోని బతికపల్లికి చెందిన పోచంపల్లి మల్లయ్య (56) అనారోగ్య కారణాలతో తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవి కిరణ్ తెలిపారు. కొన్నేళ్లుగా కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మల్లయ్య జీవితంపై మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు.. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాలిక బలవన్మరణం

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల భీష్మనగర్‌లో బాలిక(15) గురువారం ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కూతురు మరణాన్ని తట్టుకోలేక తల్లి స్పృహ తప్పి పడిపోయింది. పాఠశాలలో విద్యార్థి వేధించడం వల్లే ఈ చర్యకు పాల్పడిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి పట్టణంలోని బీడీ కాలనీలో సాదుల్లాఖాన్‌కు చెందిన ద్విచక్ర వాహనం చోరీ జరిగినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మంగళవారం రాత్రి తన ఇంటి ముందు వాహనాన్ని నిలిపి ఉంచారు. బుధవారం ఉదయం చూసేసరికి కనిపించలేదు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

పూజల పేరిట మోసం

సారంగాపూర్, న్యూస్‌టుడే: పూజలు చేస్తామంటూ ఓ మహిళను మోసం చేసి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు అభరణాలు ఎత్తుకెళ్లారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లెలో ఒంటరిగా ఉన్న లలిత అనే మహిళ ఇంటికి ఇద్దరు వ్యక్తులు పూజారులుగా వెళ్లారు. పూజలు చేస్తామని పొగ వేయగా స్పృహ కోల్పోవడంతో చెవులకు ఉన్న అర తులం బంగారు అభరణాలు, కొంత మొత్తం నగదు తీసుకొని పరారైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై దత్తాద్రిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, గ్రామంలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అపరిచితులను నమ్మవద్దని, అనుమానాస్పదంగా కనపడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ధర్మపురి గ్రామీణం: రాయపట్నం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. నాగారాం గ్రామానికి చెందిన మేడిశెట్టి వెంకట్, అశోక్ ద్విచక్ర వాహనంపై రాయపట్నం నుంచి ధర్మపురి వస్తుండగా.. లేగదూడ అడ్డు రావడంతో కిందపడ్డారు. ఎదురుగా వస్తున్న ఆటో.. ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే క్రమంలో బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్‌తోపాటు వారిద్దరికి గాయాలయ్యాయి.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన మాలెపు శ్రీనివాస్ ఇంట్లోకి స్వామి అలియాస్ శ్యాంసుందర్ పాత కక్షలతో అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి చంపుతానని బెదిరిస్తూ భయాందోళనకు గురిచేసినట్లు పేర్కొన్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

విద్యుత్తు మోటార్ల దొంగల పట్టివేత?

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం చల్‌గల్‌లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులను రైతులు పట్టుకొని గురువారం పోలీసులకు అప్పగించారు. వ్యవసాయ మోటార్లను ఎత్తుకెళ్లేందుకు యత్నిస్తుండగా ఇద్దరిని పట్టుకున్నారు. ఒకరు ఇబ్రహీంపట్నానికి చెందిన మరొకరు చల్‌గల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ విషయమై పోలీసులు విచారణ జరుపుతున్నారు. పట్టుకున్న వారు దొంగలా లేక ఎవరు అనేది విచారణలో తేలనుంది.

జిల్లా స్థాయి కళోత్సవ్


ఉపాధ్యాయులతో విజేతలు

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: జగిత్యాలలోని టీచర్స్ భవన్‌లో సమగ్రశిక్ష జిల్లావిద్యాశాఖ ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి కళోత్సవ్ గురువారం ముగిసింది. వోకల్ మ్యూజిక్‌లో జగిత్యాల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని వైష్ణవి, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో కేజీఆర్ పాఠశాల విద్యార్థిని తరుణి, డ్యాన్స్‌లో జగిత్యాల కేజీబీవీ విద్యార్థినులు, థియేటర్ ఆర్ట్స్‌లో రామన్నపేట జడ్పీహైస్కూలు విద్యార్థిని అనూష, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్‌లో కొడిమ్యాల మోడల్ స్కూలు విద్యార్థిని సంజన, దృశ్య కళల పోటీలో నమిలికొండ జడ్పీహైస్కూలు విద్యార్థిని అక్షయ మొదటిస్థానాలు సాధించారు. వీరు నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి కళోత్సవ్‌లో పాల్గొంటారని జిల్లా సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్ తెలిపారు. న్యాయనిర్ణేతలుగా మహేశ్, రాజేంద్రప్రసాద్, సతీష్, లక్ష్మణ్, సంతోష్‌చారి వ్యవహరించారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేత


ట్రోఫీ అందజేస్తున్న డీఎస్పీ

మల్యాల, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా గురువారం మల్యాల మండల కేంద్రంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాలకు చెందిన జట్లు పాల్గొని సత్తాచాటాయి. విజేత జట్టుగా పెగడపల్లి, రన్నర్స్ జట్టుగా కొడిమ్యాల మండలం నమిలికొండ నిలువడంతో సాయంత్రం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ట్రోఫీలు అందజేశారు. ఎస్సైలు సందీప్, రవికిరణ్, నరేష్ పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన

కొడిమ్యాల, న్యూస్‌టుడే: వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో కొడిమ్యాల మండలం రామకిష్టాపూర్ గ్రామంలోని హార్వెస్టర్ యజమానులు, రైతులతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పర్లపెల్లి జ్యోతి మాట్లాడుతూ పంటను కోసే సమయంలో హార్వెస్టర్ ఫ్యాన్ వేగాన్ని తగుమోతాదులో పెట్టుకోవడం ద్వారా తప్ప, తాలు లేకుండా నాణ్యమైన పంట వస్తుందని తెలిపారు. ఏఈవోలు గ్రీష్మ, రాజేష్, హార్వెస్టర్ యజమానులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భారాస నాయకులపై అక్రమ కేసులు సరికాదు

రాయికల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ తీరును సామాజిక మాధ్యమాలలో ప్రశ్నిస్తే భారాస నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో సైబర్ క్రైమ్ కేసులో విడుదలైన భారాస నాయకుడు అనుమల్ల మహేష్‌ను గురువారం పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు భారాస నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని అన్నారు. రాజలింగం, దావ సురేష్, స్పందన, కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, రత్నాకర్‌రావు, తదితరులున్నారు.

ఆరోగ్య పరిరక్షణపై దృష్టిసారించాలి

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్య పరిరక్షణపై అందరూ దృష్టిసారించాలని వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు టీషర్టులను వ్యాపారవేత్త దావ తిరుపతి గురువారం పంపిణీ చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎర్ర నర్సయ్య, పరందాం తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిలో నిర్మించిన ట్యాంక్ పరిశీలన

సారంగాపూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్ ఘాట్‌పై అటవీశాఖ భూమిలో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకును గురువారం కేంద్ర అటవీశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ కైలాశ్ భీంరావ్ బిశ్వాస్ పరిశీలించారు. 2019లో మిషన్ భగీరథ ట్యాంకు నిర్మాణం కోసం కేంద్ర అటవీశాఖ అనుమతి కోసం అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాణం చేపట్టే సమయంలో 0.45 హెక్టార్లలో అటవీ భూమి, చెట్లు నష్టపోవడంతో, దీనికి బదులుగా అందించిన భూమి, నాటిన మొక్కల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఎఫ్‌వో రవిప్రసాద్, జగిత్యాల, ధర్మపురి ఎఫ్‌ఆర్‌వోలు పద్మారావు, శ్రీనాథ్, డీఆర్వో రవికుమార్, సెక్షన్ అధికారి గంగారాం, బీట్ అధికారి రంగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలోకి మిగులు జలాల విడుదల

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరగటంతో గురువారం మరోసారి వరదగేట్లను తెరిచారు. 18,826 క్యూసెక్కుల వరద వస్తుండగా 3 గేట్లద్వారా 9,372 క్యూసెక్కులను, ఎస్కేప్ గేట్లద్వారా 2,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఇతర కాలువలు, ఎత్తిపోతల పథకాలు కలుపుకొని ఇన్‌ఫ్లోకు సమానంగా ఔట్‌ఫ్లోను కొనసాగిస్తుండగా ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటిని నిల్వచేస్తున్నారు.

ఆసుపత్రి తనిఖీ

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సాయంత్రం జిల్లా వైద్యాధికారి డాక్టర్ సమియోద్దీన్ తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, జ్వర పీడితుల వివరాలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

రోళ్లవాగు ముంపు ప్రాంతాల పరిశీలన


వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

సారంగాపూర్, న్యూస్‌టుడే: బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణలో భాగంగా ముంపునకు గురవుతున్న అటవీ భూములను అటవీ, ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు పరిధిలో దాదాపుగా 900 ఎకరాల్లో ముంపునకు గురవుతుండగా ఇప్పటి వరకు 500 ఎకరాల్లో సర్వే పూర్తి కాగా 21 వేల చెట్లు ఉన్నట్లు గుర్తించారు. మరో 15 రోజుల్లో సర్వే పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. డీఈఈ చక్రునాయక్, రేంజర్ శ్రీనాథ్, సెక్షన్ అధికారి గంగారాం, ఏఈలు అనిల్, మహేష్, బీట్ అధికారులు,.తదితరులు పాల్గొన్నారు.

చింతచెట్టుకు కల్లు అని వదంతులు


రాజారాంపల్లిలో చెట్టు కొమ్మకు కట్టిన సీసాలో కారుతున్న ద్రవం

వెల్గటూరు, న్యూస్‌టుడే: చింతచెట్టు నుంచి కల్లు కారుతోందని ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో వదంతులు వ్యాపించాయి. గ్రామంలోని కొలిమి చింతచెట్టువి రెండు చోట్ల కొమ్మలను తొలగించడంతో.. కోసినచోట కల్లు లాంటి ద్రవం కారడాన్ని గమనించి చూడటానికి గ్రామస్థులు వరుస కట్టారు. దానికి ఓ సీసాను కట్టారు. దీనిపై సీనియర్ జీవశాస్త్ర ఉపాధ్యాయులు రామచంద్రాన్ని సంప్రదించగా.. చెట్టు వేరు నుంచి కాండం, కొమ్మల వరకు దారు కణజాలం నీటి సరఫరాను అందిస్తుందన్నారు. కొమ్మను ఏటావాలుగా కోయడం వల్ల సరఫరాకు అంతరాయంతో ఈ నీరు దాని నుంచి స్రవిస్తుందన్నారు.

అసత్య ప్రచారంపై చర్యలు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జడ్పీ కార్యాలయంలో కీచకుడు అంటూ ఓ యూట్యూబ్ ఛానల్‌లో అసత్య ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో బి.గౌతంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వీడియోను రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలుంటాయని పేర్కొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులు తమ ఆవులు, గేదెలకు తప్పనిసరిగా గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.నరేశ్ పేర్కొన్నారు. జగిత్యాల మండలం పొలాసలో ఉచిత టీకాల కార్యక్రమాన్ని గురువారం పర్యవేక్షించారు. కల్లెడ వెటర్నరీ సర్జన్ డాక్టర్ హిమజ, లైవ్‌స్టాక్ అధికారి కందుకూరి పూర్ణచందర్, రాజేశ్, గంగాధర్, వనిత, వెంకటమ్మ, రాజు, గంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీటులో దినుసుల కొనుగోలు

జగిత్యాల వాణిజ్యం: జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం మక్కలకు క్వింటాలుకు రూ. 1,700 నుంచి రూ.2,411 వరకు ధరలు పలికాయి. ఎంటీయూ1010 రకం ధాన్యం రూ.1,885 నుంచి రూ. 1,908, సోయాబీన్ రూ.3 వేల చొప్పున ధరలు లభించాయని మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

జగిత్యాల వ్యవసాయం: వ్యవసాయశాఖ జగిత్యాల డివిజన్ సహాయ సంచాలకుడిగా జగిత్యాల రూరల్ మండల వ్యవసాయాధికారి తిరుపతినాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. డీఏవో రాంచందర్ ధర్మపురి ఏడీఏగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మల్యాల: మల్యాల విద్యుత్తు ఏడీఈ సీహెచ్ బాలలింగం పెద్దపల్లికి బదిలీపై వెళ్లగా 'సెస్'లో పనిచేసిన రంగు మహేందర్ మల్యాల ఏడీఈగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది సత్కరించారు.

రైతుల ఖాతాలకు పంటనష్ట పరిహారం

జగిత్యాల వ్యవసాయం: జిల్లాలో వానాకాలంలో 70 ఎకరాల్లో జరిగిన పంటనష్టానికి చెందిన పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.7 లక్షలను రైతుల ఖాతాలకు నేరుగా జమచేశారని డీఏవో రాంచందర్ తెలిపారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానం

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణం అరవింద్‌నగర్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో కోజాగిరి పూర్ణిమ పురస్కరించుకొని గురువారం పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకం చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు ప్రసాదం స్వీకరించారు. బట్టు సుధాకర్, గుడికందుల శ్రీనివాస్, తవుటు రాంచంద్రం, వీరబత్తిని శ్రీనివాస్, కొత్తపల్లి నాగభూషణం, కెఎల్‌వీ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

జగిత్యాల విద్యానగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సత్వరం విడుదల చేయాలని అభావిప రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ తదితరులు కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు కావస్తున్నా బకాయిలు విడుదల కాకపోవడంతో డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అభావిప జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్, నగర కార్యదర్శి రాజు, మనోజ్, విశాల్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణం: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలతో పాటు ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి మంగళంపల్లి మారుతి డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడకుండా వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం

సారంగాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి అబుదాబి సహాయ బృందం సభ్యులు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. బుగ్గారం మండలంలోని సిరికొండకు చెందిన పంచిత లక్ష్మన్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీర్‌పూర్ మండలంలోని కొల్వాయికి చెందిన అబుదాబి సహాయ బృందం సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. మండలంలోని తుంగూర్‌కు చెందిన పొన్నమల్ల అమ్మక్క అనారోగ్యంతో బాధపడుతుండడంతో తుంగూర్ గ్రామ యువసేన సభ్యులు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు.

మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో రెండు బాధిత కుటుంబాలకు అమెరికా గ్రేటర్ అట్లాంట తెలంగాణ సొసైటీ(గేట్స్) సభ్యుడు బత్తిని నవీన్ కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన పుల్ల రాజు అనారోగ్యంతో మరణించగా కుటుంబానికి రూ.లక్ష, జుంగుల గంగాధర్ ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కింద పడి మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.50 వేలు గేట్స్ ఆధ్వర్యంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. గురువారం డిపాజిట్ పత్రాలను గ్రామానికి చెందిన బత్తిని శంకర్‌గౌడ్, గూడూరు తిరుపతి, కోలు పెద్దగంగారాం, గణేశ్‌లు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఏజీపీకి సన్మానం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జీ కోర్టులో ఏజీపీగా నియమితులైన న్యాయవాది గోనే రాజేశ్‌ఖన్నాను అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు గోనే శ్రీహరి, మల్లికార్జున్, ప్రసాద్, రాజేంద్రప్రసాద్, సురేందర్, ధరందీప్, ఎల్లారెడ్డి, రాజశేఖర్, సురేఖ, కల్యాణి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రాయికల్ : రాయికల్ మండలంలో రహదారుల విస్తరణకు ప్రభుత్వం నిధులు కేటాయించగా ఇటిక్యాల, చెర్లకొండాపూర్ గ్రామాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్గటూరు: మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం పంపిణీ చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలో 106 మంది లబ్ధిదారులకు రూ.27.46లక్షల ఆర్థిక సాయం మంజూరైనట్లు ఆయన తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ గీతాశ్రమంలో గాయత్రి యజ్ఞం

ధర్మపురి గ్రామీణం: వాల్మీకి జయంతి సందర్భంగా తీగలధర్మారంలోని శ్రీకృష్ణ గీతాశ్రమంలో గురువారం గాయత్రి యజ్ఞాన్ని నిర్వహించారు. గ్రామస్థులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి యజ్ఞంలో పాల్గొన్నారు. సామూహిక గీత పారాయణం చేశారు. నిర్వాహకులు రాజిరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడికి పితృవియోగం

జగిత్యాల, న్యూస్‌టుడే: చిన్న పిల్లలకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు చేస్తున్న లండన్‌లో స్థిరపడ్డ ప్రముఖ వైద్యుడు డాక్టర్ దన్నపునేని రమణ తండ్రి దన్నపునేని వెంకటేశ్వర్‌రావు గురువారం జగిత్యాలలో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలిసిన డాక్టర్ రమణ లండన్ నుంచి జగిత్యాలకు వచ్చారు.

శబరిమలకు పాదయాత్ర

రాయికల్ పట్టణం: రాయికల్ పట్టణానికి చెందిన తిరుకొవెల సురేందర్ గురువారం శబరిమలకు మహా పాదయాత్ర చేపట్టాడు. రాయికల్ అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శబరిమలకు పాదయాత్ర ప్రారంభించాడు. అర్చకుడు మునుగోటి సత్యనారాయణ శర్మ తదితరులున్నారు.

రూ.1.80 కోట్లకు తలనీలాల టెండర్

మల్యాల : కొండగట్టులో ఏడాదిపాటు తలనీలాల సేకరణకు రూ.1,80,01,000కు టెండర్ దక్కించుకున్నట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు. గురువారం దేవాదాయశాఖ కమిషనరు ఉత్తర్వుల మేరకు అదనపు కమిషనరు కృష్ణవేణి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన టెండర్లలో కె.వి.ఎన్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు హెచ్చుపాటదారుగా నిలిచినట్లు ఈవో పేర్కొన్నారు. 2024 ఆగస్టు 1 నుంచి 2025 జూలై 31 వరకు తలనీలాలు సేకరించుకునే వీలుంటుందని వివరించారు.

కోజగిరి పౌర్ణమి వేడుకలు

మెట్‌పల్లి పట్టణం: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో కోజగిరి పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. అర్చకులు ముందుగా గణపతి గౌరి, నవగ్రహా, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేసి పాలల్లో చంద్రుడిని చూశారు. మహజన్ నర్సింలు, దొంతుల నాగభూషణం, ఇల్లెందుల శ్రీనివాస్, దొంతుల రాజు, పవన్, రాజు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూరు: కోజాగరి పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కిషన్‌రావు పేటలోని శ్రీ నాగపల్లి లక్ష్మి నర్సింహస్వామి ఆలయం చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం బలిపీఠాల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. కొండపై ఉన్న ధ్రువమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

■ రక్త సంబంధీకుల మధ్య పెరుగుతున్న హత్యలు

■ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విపరీత ధోరణి

కత్తులు దూస్తున్న బంధుత్వాలు



న్యూస్‌టుడే - మేడిపల్లి, జగిత్యాల

అమ్మ కడుపులో గొడవలు, గొడవలు తెలియకుండా పురుడు పోసుకున్న అన్నదమ్ములు.. పెరిగి పెద్దయిన తర్వాత కొట్టి బంధాలను మరిచిపోతూ కత్తులు దూసుకుంటున్నారు. పూర్వాల నుంచీ సంక్రమిస్తున్న సంప్రదాయాలను నెలవుగా ఉన్న సోదర బంధాన్ని హత్యల మాటున దూరం చేసుకుంటున్నారు. కడదాకా తోడుంటామని బాస చేసుకున్న భార్యాభర్తల సంబంధం అనుమానం, వివాహేతర సంబంధాలతో గొంతు నులుముకుంటున్నారు. అల్లారుముద్దుగా అప్యాయతలు పంచిన తల్లిదండ్రులే తమ రక్త సంబంధాలను చిదిమేస్తున్నారు. తల్లిని కుమారుడు, కుమారుడిని తండ్రి హతమారుస్తున్న సంఘటనలు ప్రతి ఒక్కరినీ కలచి వేస్తున్నాయి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇటీవల ఛిద్రమైన బంధాల సాక్షిగా పెరుగుతున్న హత్యలపై కథనం..

15 రోజులు.. 7 హత్యలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 15 రోజుల్లో మొత్తం 8 హత్యలు జరిగితే అందులో 7 రక్తసంబంధీకుల మధ్య జరిగినవే కావడం విపరీత ధోరణికి అద్దం పడుతోంది. పెరుగుతున్న ఆస్తుల విలువ, మద్యం, వివాహేతర సంబంధాలు, అసూయ తదితరాలు కుటుంబ బంధాల మధ్య అంతరాలను పెంచుతున్నాయి. సోదరుల మధ్య సంబంధాలు చెడిపోతున్నాయి. భార్యాభర్తలు కొందరిలో చిన్న చిన్న కారణాలే హత్యలకు దారితీస్తున్నాయి. ఇటీవల జరిగిన రక్త సంబంధీకుల హత్యల్లో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో రెండు చొప్పున హత్యలు జరగగా పెద్దపల్లి జిల్లాలో ఒక హత్య కేసు నమోదైంది.

■ హుజూరాబాద్ మండలం రాజపల్లికి చెందిన నోముల అంజి మద్యానికి బానిసయ్యాడు. అప్పులు తీర్చుకునేందుకు తనకు వ్యవసాయ భూమి ఇవ్వాలంటూ అన్న రాజుతో గొడవపడ్డాడు. అన్నను హతమార్చేస్తే భూమి తనకే దక్కుతుందని దుర్బుద్ధితో ఈ నెల 4న రాజును హత్య చేశాడు. బాధాకరమేమిటంటే తల్లిదండ్రులు కూడా తమ పెద్ద కుమారుడి హత్యకు చిన్న కుమారునికి సహకరించారు.
కారణాలు: మద్యం మత్తు, ఆస్తి కాజేయాలనే దురుద్దేశం

■ గోదావరిఖని యైటింక్లైన్ కాలనీలో కాకినాడ అంజలి అనే వివాహిత వినయ్‌కుమార్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉండటంతో భర్త శివరామ క్రిష్ణ, అతని సోదరుడు కుమార్ కలిసి వినయ్‌కుమార్‌ను ఈ నెల 10న హతమార్చారు. కుటుంబసభ్యులు, ఇతరుల ఆదరణ కోల్పోయిన అంజలి తన సొంత పట్టణమైన గుంటూరులో ఆత్మహత్య చేసుకుంది. కారణం: వివాహేతర సంబంధం

■ అక్టోబరు 9న.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లిలో చంద్రయ్య తన సోదరుడు కుమారస్వామితో గొడవకు దిగాడు. మాటామాటా పెరగడంతో కుమారస్వామి దాడి చేయడంతో తమ్ముడు చంద్రయ్య మృతిచెందాడు.
కారణాలు: క్షణికావేశం, మద్యం మత్తు, పాత గొడవలు

■ కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన నేతుల మల్లేశంను అతని బావమరిది భూపతి గంగారాం ఈ నెల 1న హత్య చేసి వరదకాలువలో పడేశారు.
కారణాలు: మల్లేశం నేర చరిత్ర, గంగారాం చెల్లెలు లావణ్య, కోడలుకు మల్లేశం నుంచి వేధింపులు

■ రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం జవహర్ నాయక్ తండాలో గుగులోతు సుశీలను భర్త రవి గొంతు నులిమి హత్య చేశాడు. ఈ నెల 12న ఈ ఘటన జరిగింది.
కారణాలు: మద్యం మత్తు, భార్య అనుమానించడం

■ వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన మామిండ్ల మల్లయ్యను సెప్టెంబరు 29న మొదటి భార్య కుమారుడు మామిండ్ల రాజు సహా ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు అల్లుళ్లు కలిసి హత్య చేశారు.
కారణం: ఆస్తి పంపకాలు

■ జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాంకు చెందిన నన్నపనేని విద్యాసాగర్ రాజును అక్టోబరు 1న అతని సోదరుడు విక్రం రాజు హత్య చేశాడు.
కారణం: భూ తగాదాలు

ఆప్యాయతలే బలం.. బలగం

కుటుంబాల మధ్య ఆప్యాయతలు పెరగాలి కానీ అంతరాలు ఎక్కువవుతున్నాయి. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పుడు ఎవరేం చేసేదీ, మానసిక ప్రవర్తనపై కుటుంబ పెద్దలకు అవగాహన ఉండేది. ఇప్పుడు చరవాణి సహా ఇతర మాధ్యమాల దుష్ప్రభావం బంధాలను చెరిపేస్తున్నాయి. ఆస్తులే ముఖ్యం కాదనే భావన పెరిగినప్పుడు దాడులకు స్థానం ఉండదని మానసిక నిపుణులు చెబుతున్నారు. హత్య లాంటి విపరీత చర్య అనంతరం ప్రాయశ్చిత్త పడటం కంటే అనుబంధాలు, ఆప్యాయతలను వల్లె వేసుకుంటే కుటుంబం ప్రశాంతతకు చిరునామాగా మారుతుంది. ఒకరికొకరు బలం, బలగం అనే భావన ఉంటే రక్తపు మరకలే అంటవు అని నిపుణులు పేర్కొంటున్నారు.

భావోద్వేగాలను నియంత్రించుకోలేకనే..



- డాక్టర్ వీరేందర్, మానసిక నిపుణుడు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధన ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. దుబాయి వెళ్లి కొందరు ఎక్కువ డబ్బులు సంపాదిస్తే ఇంకొందరు వారిపై అసూయ పెంచుకుంటున్న పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో భూ వివాదాలు కూడా ఎక్కువయ్యాయి. డబ్బు కోసం ఏమైనా చేయొచ్చు అనే విపరీత ధోరణి పెరగడం వల్లే హత్యలు జరుగుతున్నాయి. మద్యం ప్రభావం కూడా మనిషి ఏం చేస్తున్నాడో తెలియని స్థితికి తీసుకు వెళ్తుంది. భావోద్వేగాలను నియంత్రించుకోలేక ఏం నిర్ణయం తీసుకుంటున్నారో కూడా తెలియడం లేదు. ఎమోషనల్ కంట్రోల్ తక్కువ.. మనిషిని ఏం చేస్తుందని తెలీదు. బంధాలు కూడా ఈ కారణాల వల్లే దూరమవుతూ హత్యలు పెరుగుతున్నాయి. హత్యలు చేసేవారికి ఐక్యూ లెవల్స్ తక్కువ ఉన్నట్లు మేం భావిస్తాం.

మద్యం, ఆస్తులు కారణమవుతున్నాయి



- రఘుచందర్, డీఎస్పీ జగిత్యాల

మద్యం మత్తులో, వివాహేతర సంబంధాల వల్ల, ఆస్తుల గొడవలతో ఎక్కువగా హత్యలు జరుగుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు చెడిపోవడంతో హత్యలు కూడా పెరుగుతున్నాయి. సాధారణ హత్యల కంటే రక్తసంబంధీకుల మధ్య హత్యలు విపరీత ధోరణులకు అద్దం పడుతున్నాయి. ఠాణాలకు వివిధ సమస్యలపై వచ్చేవారిని పరిశీలిస్తే... ఆస్తి తగాదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కౌన్సెలింగ్ ద్వారా పలు కుటుంబాలు కలిసి మెలిసి ఉంటున్నాయి. ఉమ్మడి కుటుంబ విధానం, విలువలతో కూడిన జీవనం లాంటి వాటిపై అవగాహన కలిగిస్తే రక్త సంబంధీకుల మధ్య గొడవలు, దాడులు, హత్యలు తగ్గించవచ్చు.

ప్రశస్త్‌తో దివ్యాంగ లక్షణాల గుర్తింపు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం



ప్రశస్త్ యాప్

పిల్లల్లో దివ్యాంగ లక్షణాలు ఉంటే సరైన సమయంలో గుర్తించి, చికిత్స అందించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి సంకల్పించింది. బాల్యంలోనే దివ్యాంగ లక్షణాలు కనిపించినా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించక పోవడంతో వయస్సు పెరుగుతున్న కొద్దీ సమస్యలు తీవ్రమవుతాయి. దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స అందించడం ద్వారా మెరుగైన జీవనం గడపగలరు. చిన్నారుల్లో దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి ఆధ్వర్యంలో ప్రశస్త ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించింది. దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో నర్సరీ నుంచి 8వ తరగతి లోపు పిల్లల్లో మూడు దశల్లో దివ్యాంగ లక్షణాల నిర్ధారణ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

■ విద్యార్థులు ఇంట్లో కంటే పాఠశాలలోనే అధిక సమయం గడుపుతారు. ఈ క్రమంలో చిన్నారుల నడకలో తేడా, లేదంటే నడవడానికి ఇతరుల సహాయం తీసుకోవడం, శరీరంలోని భాగాల కదలికలో తేడా, మెడ, చేతులు, వేళ్లు, మణికట్టు, కాళ్లు వంటి 21 రకాల దివ్యాంగ లక్షణాలను ఉపాధ్యాయులు గుర్తించే అవకాశం అధికంగా ఉంటుంది. దివ్యాంగ లక్షణాలు గల చిన్నారులను గుర్తించి వారిని ప్రశస్త యాప్‌లో పొందుపరుస్తారు. ఇందుకోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చరవాణుల్లో మెయిల్ ద్వారా యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

■ విద్యార్థుల్లో దివ్యాంగ లక్షణాల గుర్తింపు ప్రక్రియ మూడు దశల్లో జరగనుంది. మొదటిదశలో ఉపాధ్యాయుడు రెండు వారాలపాటు గమనించి వివరాలను 26లోగా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రెండో దశలో గుర్తించిన విద్యార్థులను శిక్షణ పొందిన నిపుణులు గమనించి మరోమారు యాప్‌లో నమోదు చేస్తారు. చివరి దశలో విద్యార్థి తల్లిదండ్రులకు వివరించి, బాల్యంలోనే మెరుగైన చికిత్స అందించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని నిపుణులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారి అనుమతి మేరకు పరీక్షలకు పంపించనున్నారు.

పాత కక్షలతోనే యువకుడి హత్య

కోరుట్ల, న్యూస్‌టుడే: పాతకక్షలతోనే యువకుడి హత్య జరిగినట్లు డీఎస్పీ ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ప్రకాశంరోడ్డుకు చెందిన పంబాల మధు, ఇప్పకాయల నరేశ్‌తో బోయిని సాగర్‌కు ఈనెల 13న రాత్రి గొడవ జరిగింది. గుద్దేటి వెంకటేశ్ వీరి మధ్య రాజీకి యత్నించగా సాగర్ ఒప్పుకోలేదు. సాగర్ తమను ఎప్పటికైనా చంపుతానని బెదిరించాడని మధు, నరేశ్ వెంకటేశ్‌తో చెప్పారు. ఈనెల 14న రాత్రి 10 గంటల ప్రాంతంలో ప్రకాశంరోడ్డులోని పంబాల నాగరాజు ఇంటికి వెళ్లిన సాగర్ అతడితో గొడవపడ్డాడు. విషయం తెలుసుకున్న గుద్దేటి వెంకటేశ్, గుద్దేటి విజయ్, పంబాల రాకేశ్ సంఘటన స్థలానికి వెళ్లి సాగర్‌ను రోడ్డుపై నెట్టివేయడంతో కిందపడ్డాడు. వెంటనే వెంకటేశ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో సాగర్ గొంతుకోసి హత్య చేశాడు. అనంతరం నిందితులు ఘటన స్థలం నుంచి పరారయ్యారు. సీఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది నిందితుల కోసం గాలింపు చేపట్టారు. గురువారం కోరుట్ల శివారులోని గుద్దేటి వెంకటేశ్‌కు చెందిన నాగులమ్మ బ్రిక్స్ తయారీ ఫ్యాక్టరీ వద్ద నిందితులు అయిదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఒక కత్తి, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులలో ఒకరైన పంబాల నాగరాజు పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నామని, ఇతరుల ప్రమేయం ఉన్నట్లు తేలితే చట్టపరమైనా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. సీఐ సురేశ్‌బాబు, ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ స్థలాల కబ్జా

న్యూస్‌టుడే, గంగాధర

విలువైన భూముల్లో అక్రమ కట్టడాలు

పట్టా భూములైనా, సర్కారు భూములైనా కబ్జాకు కాదేది అనర్హమంటూ ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. మారుమూల పల్లెల్లో సైతం గుంట స్థలం రూ.లక్షల్లో ధరలకు రెక్కలు రావడంతో ఇక వాణిజ్య స్థలాలను వదిలిపెట్టడంలేదు. ఇందుకు చెరువులు, కుంటల శిఖం భూములతోపాటు సాగునీటి కాలువలను సైతం కబ్జా చేస్తున్నారు. అక్రమ కట్టడాలకు పాల్పడుతుండగా అవి కాస్తా కుచించకపోయి వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడింది.

గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం పరిధిలో మంగపేట ఎల్లమ్మ చెరువు నుంచి వేములవాడకు కుడి కాలువ 19 కి.మీ ఇప్పటికే పూర్తి చేశారు. కాలువ 60 మీటర్ల వెడల్పుతో నిర్మించగా కుడి వైపు దారికి 4 మీటర్లు, ఎడమ వైపు దారికి 6 మీటర్ల స్థలం వదిలిపెట్టారు. ఇక వాణిజ్య కేంద్రంగా ఉన్న గంగాధర ప్రధాన కూడలిలో మాత్రం 1.6 కి.మీ పొడవునా 45 మీటర్ల వెడల్పుతో ఇరువైపులా దారులకు స్థలం వదిలి కాలువ తవ్వారు. ఈ కాలువ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీలు, వాటికింద ఉపకాలువల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టారు. ఇక ర్యాలపల్లి వైపు ఎడమకాలువ 20.5 కి.మీ 40 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయగా దానికింద 10 ఉపకాలువలు తవ్వారు. భూసేకరణ జరిపి బాధితులకు అప్పటికే నష్టపరిహారం అందజేశారు.

తేల్చని హద్దులతో ఆక్రమణలు

గ్రామీణ ప్రాంతాల్లో కాలువ పక్కనున్న భూములు పంటలకు అనువుగా ఉండి కొందరు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్ గ్రామ పంచాయతీ)లో గుంట స్థలం కనీస ధర రూ.15 లక్షలు పలుకుతుండగా కబ్జారాయుళ్ల కన్నుపడింది. గంగాధర ప్రధాన కూడలి నుంచి కురిక్యాల రెవెన్యూ శివారు (పిట్టలపల్లి) వరకు 1.6 కి.మీ వాణిజ్య కేంద్రంగా ఉండి ఇక్కడి భూములకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండు ఉంది. కొందరు కాలువ పక్కనున్న దారులను వదిలిపెట్టకుండా ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. గతంలో కాలువ నిర్మాణం జరుగుతుందని తెలిసి కొందరు అక్రమ కట్టడాలతో నష్టపరిహారం పొందగా, మరికొందరు కాలువ తవ్వకం జరిగి దారులకు వదిలిపెట్టిన స్థలాలు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. ఇంకొందరు ఇదంతా తమదే స్థలమంటూ కాలువ భూములను అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటంతటికీ సాగు నీటి శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. కాలువ నిర్మాణానికి భూసేకరణ జరిపిన అధికారులు అప్పట్లోనే హద్దులు నిర్ణయించి కంచె వేస్తే విలువైన భూములు కబ్జాకు గురయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే ఎల్లంపల్లి పైపులైన్ల వెంట దారులతోపాటు పైపులైన్ల పైభాగాన్ని ఆక్రమించి పంటలు వేస్తుండగా పైపులైన్లకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి కాలువల భూములు కాపాడాల్సిన అవసరముంది.



కాలువ స్థలంలో వెలసిన నిర్మాణాలు

సర్వే చేసి తొలగిస్తాం

నిర్మాణ దశలో ఉన్న కాలువ భూములు ఎవరు ఆక్రమించినా సర్వే చేసి తొలగిస్తాం. కాలువకు కుడి వైపు ఆరు మీటర్లు, ఎడమ వైపు 7 మీటర్ల దూరంలో మురుగుకాలువలు నిర్మించి దారులు వేయాల్సి ఉంది. ఇప్పటికే భూసేకరణ జరిపి నష్టపరిహారం కూడా అందజేశాం. గతంలో నిర్మించిన వాటికి కూడా పరిహారం అందజేశాం. **- వజహత్ అలీ, ఏఈ**

సీసీఐ కొనుగోళ్లకు రంగం సిద్ధం

నోటిఫై జిన్నింగ్ మిల్లుల వద్ద ఏర్పాట్లు

న్యూస్‌టుడే, జమ్మికుంట



గురువారం జమ్మికుంటలోని ఓ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కేంద్రం ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన మార్కెటింగ్ శాఖ అధికారులు

కొత్తపత్తి విక్రయాలు పెరుగుతున్న రైతులకు మద్దతు ధర లభించకపోవటంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు సిద్ధం అవుతున్నారు. జమ్మికుంట ప్రధాన వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు క్రమేణా ఎక్కువవుతున్నా అధిక తేమశాతంతో మద్దతు ధర రూ.7,521 పలకని పరిస్థితి ఉంది. పత్తికి మద్దతు ధర అందించేందుకు సీసీఐ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని 18 పత్తి జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసుకోగా అందులో జమ్మికుంటలోనే ఏడు ఉన్నాయి. నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లుల్లో మార్కెటింగ్ శాఖ అధికారులు గురువారం ఏర్పాట్లు చేపట్టారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ పత్తి కొనుగోళ్లకు సంబంధించిన పత్తి నాణ్యత, తేమ శాతం, మద్దతు ధర వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోళ్లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ పనులు మూడు మిల్లుల్లో పూర్తయినట్లు స్థానిక మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. నోటిఫై చేసుకున్న జిన్నింగ్ మిల్లుల యజమానులతో సీసీఐ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉందని ఆయన చెప్పారు.

విక్రయానికి నిబంధనలు : సీసీఐకి పత్తిని విక్రయించేందుకు రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను తీసుకురావాలి. ■ పత్తి తేమ శాతాన్ని బట్టి మద్దతు ధర రూ.7,521 నుంచి 7,720.16 పైసలు దాకా ఉంది.

సీసీఐ నోటిఫై చేసుకున్న జిన్నింగ్ మిల్లులు (జిల్లాల వారీగా)	
కరీంనగర్	9
పెద్దపల్లి	4
సిరిసిల్ల	5
జగిత్యాల	0

అయ్యప్ప మహా పాదయాత్ర ప్రారంభం

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కరీంనగర్ నుంచి కేరళలోని అయ్యప్ప క్షేత్రం శబరిమలకు మహాపాదయాత్ర గురువారం ప్రారంభమైంది. లోక కల్యాణ సంకల్పానికి జిల్లా కేంద్రానికి చెందిన గురుస్వామి గడప నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన 24వ మహాపాదయాత్రను గురుస్వామి కావేటి పరమేశ్వర్ భగత్‌నగర్ అయ్యప్ప దేవాలయం నుంచి ప్రారంభించారు. మొదట ఆలయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చిన దీక్షాపరుల ఇరుముడి బంధనం వంటి పూజలు నిర్వహించారు. అనంతరం కోతిరాంపూర్ గిద్దెపెరుమాండ్ల దేవస్థానంలో పాదయాత్ర భక్తులందరికీ పడిశెట్టి భూమయ్య(టేలా) ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గురుస్వామి నాగరాజు మాట్లాడుతూ.. 60 మందితో మహాపాదయాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు యాగండ్ల అనిల్‌కుమార్, డి.సంపత్, బండారి శ్రావణ్, రుద్రాక్ష కృష్ణ, ప్రశాంత్, శ్రీహరి, కర్ణాల రాము, గంగుల సురేష్, దీక్షాపరులు పాల్గొన్నారు.



శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప దీక్షాపరులు

పిడుగుపాటుకు రైతు మృతి



నర్సింహారెడ్డి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన కామిడి నర్సింహారెడ్డి (48) అనే రైతు పిడుగుపాటుతో మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో గురువారం విషాదం నింపింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సింహారెడ్డి తనకు ఉన్న రెండెకరాలతోపాటు మరో 8 ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుండేవాడు. పొలం వద్ద పాడి ఆవులు, గేదెలను పోషిస్తూ ప్రత్యామ్నాయ ఉపాధి పొందేవాడు. ఎప్పటిలాగే పొలం వద్దకు ఉదయం వెళ్లిన నర్సింహారెడ్డి పాలు పితికి, క్యాన్‌ను పక్కన పెట్టాడు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటుండగా పిడుగుపడి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య చంద్రకళ, కుమారుడు అజయ్ ఉన్నారు. పెద్ద దిక్కు అకాల మరణంతో కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు మెండె శ్రీనివాస్, బండారి బాల్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్ తదితరులు పరామర్శించారు.

ఎంకాం, ఎంబీఏ, ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జులై, ఆగస్టు నెలల్లో జరిగిన ఎంకాం, ఎంబీఏ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్) రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

యాసంగికి సానుకూలం

న్యూస్‌టుడేతో జగిత్యాల పరిశోధనస్థానం ఏడీఆర్

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం



ఉమ్మడి జిల్లాలో అధిక వర్షపాతం కురవటం, భూగర్భ జలమట్టం బాగుండటం, ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు నీరు రానుండటంతో యాసంగిలో గరిష్ఠ విస్తీర్ణంలో పైర్లు సాగులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో వేయదగిని పంటలు, యాజమాన్యం తదితరాలను జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ **గాదె శ్రీనివాస్** 'న్యూస్‌టుడే' ముఖాముఖి ద్వారా వివరించారు. ఆ వివరాలు..

? ప్రశ్న: వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయవచ్చా.

✓ **జవాబు:** నీటి లభ్యతతో వరిని అధికంగా సాగుచేస్తారు. కానీ అనువైనచోట్ల వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల వల్ల రైతులకు మేలు చేకూరుతుంది. వరుసగా ఒకే పంటను సాగుచేస్తే పంట దిగుబడి మందగించడంతోపాటు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. ఒకే తరహా పంట సేద్యం వల్ల మార్కెట్‌లో వాటి పరిమాణం పెరిగి సరైన గిట్టుబాటు ధర లభించదు. ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా భూసారం పెరగడంతోపాటు రైతులు మద్దతు ధరను పొందుతారు. ఆరుతడి పైర్లతో నీటిని ఆదా చేయవచ్చు.

? యాసంగిలో ఏయే పంటలతో సత్ఫలితాలు సాధించవచ్చు.

✓ రైతులు ప్రధానంగా కోతులు, వన్యప్రాణులు, కూలీల సమస్య, మార్కెటింగ్ తదితరాలను పరిగణనలోకి తీసుకోవాలి. మొక్కజొన్న, జొన్న, సజ్జ, పప్పు దినుసులు, నూనె గింజలు, చెరకు, పొద్దుతిరుగుడు, కుసుమ, చిరుధాన్యాలు, ఆవాలు వంటివి ఈ తరుణంలో సాగు చేయవచ్చు. వీటిని వాణిజ్య పరంగా, ఆహారంగా ఉపయోగించేందుకు వీలుండటం వల్ల మార్కెట్‌లో గిరాకీ ఉంటుంది. డిసెంబరు తరవాత వేరుసెనగ, జనవరిలో నువ్వు పంట వేయడం వల్ల దిగుబడి ఎక్కువగా ఉంటుంది.

? పంటల మార్పిడిపై మీరిచ్చే సలహాలు.

✓ జగిత్యాల, కరీంనగర్, కూనారం పరిశోధనస్థానాలు, ఏరువాక, కృషివిజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అవగాహన సదుస్సులు నిర్వహిస్తాము. ప్రత్యామ్నాయ పంటల సాగు వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తున్నాం. అధిక దిగుబడినిచ్చే వంగడాలని ఇస్తూ ఉపయోగించమని సిఫార్సు చేస్తున్నాం. క్రిమికీటకాలు, కోతుల నుంచి పంటలను ఏ విధంగా కాపాడుకోవాలో సూచనలు అందిస్తున్నాం. ఏ కాలంలో ఎలాంటి పంటలు వేస్తే అధిక దిగుబడి లభిస్తుందో తెలుపుతున్నాము. నూతన వంగడాలను మినీకిట్లుగా రైతులకు అందిస్తున్నాము.

? నూతన సాంకేతికతను రైతులకు ఎలా చేరవేస్తారు.

✓ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా రైతులకు ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తాము. రైతుల క్షేత్రాల నుంచి మట్టి నమూనాలు సేకరించి పరిశీలిస్తాము. ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన వంగడాల తయారీకి నిరంతరం పరిశోధనలు కొనసాగుతున్నాయి. వాతావరణ మార్పుల వివరాలు ఎప్పటికప్పుడు బుల్‌టెన్‌ల రూపంలో విడుదల చేస్తున్నాం. శాస్త్రవేత్తల బృందాలను రైతుల క్షేత్రాలకు పంపించి పంటల్ని ఆశించే పురుగుల నివారణకు ఎలాంటి మందులను వినియోగించాలి, ఎంత మోతాదులో ఉపయోగించాలో తెలియజేస్తున్నాం.